క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కడ్తాల్: మండల పరిధి న్యామతాపూర్ గ్రామానికి చెందిన బండ రాంచంద్రి అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.. గురువారం రాంచంద్రి పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఇందులో మార్కెట్ చైర్ పర్సన్ యాటగీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ శ్రీనివాస్, నాయకులు మహేశ్, ఫారుఖ్, లక్ష్మీనారాయణ, జానారెడ్డి, గోపాల్, దాస్, లింగం, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య శిబిరంలో ఆయుర్వేద వైద్యురాలు ఇందిర తదితరులు

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నస్దిక్‌సింగారం ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యురాలు ఇందిర సమక్షంలో 70 మందికి పైగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు ఆయుర్వేద మందులు వాడాలని సూచించారు. షుగర్, బీపీ, ఇతర వ్యాధుల నివారణకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈర్లపల్లి శ్రీనువాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరమని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్ అన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఆమనగల్లు పట్టణానికి చెందిన చంద్రమ్మకు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.44 వేలు, జంతుక చిన్న రామయ్యకు రూ.35 వేలు, సబావత్ సక్రుకు రూ.32 వేలు, కడారి రామయ్యకు రూ.22 వేలు, కేతావత్ బుజ్జికి రూ.19 వేలు, జంగమ్మకు రూ.14 వేల చొప్పున చెక్కులు మంజూరు అయ్యాయి. ఈ మేరకు గురువారం బాధితులకు ఆయన చెక్కులు పంపిణీ చేశారు. సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలు కార్పొరేట్ వైద్యం పొందుతున్నారని, పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణయాదవ్, విజేందర్, శ్రీశైలం, పర్వతాలు, వెంకట్ పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు శిక్షణ


శిక్షణ శిబిరంలో బీఎల్‌ఓలతో ఆర్డీఓ సుమన్‌నాయక్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని రైతు వేదిక భవనంలో గురువారం మండలంలోని బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఓటరు నమోదు, తప్పుల సవరణ, ఆధార్ అనుసంధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కల్వకుర్తి నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీఓ శ్రీను నాయక్ బీఎల్‌ఓలకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ లలిత, డిప్యూటీ తహసీల్దార్లు వినోద్‌కుమార్, రాఘవేందర్‌లు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే ఐక్యత లక్ష్యం

ఆమనగల్లు: సంపూర్ణ అంధత్వ నిర్మూలనే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ పనిచేస్తుందని టాస్క్ సీఓఓ, ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ సహకారంతో ఆరో రోజులుగా కొనసాగుతున్న ఉచిత కంటి వైద్య శిబిరంలో గురువారం 730 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 450 మందికి అద్దాలు పంపిణీ చేశారు. 36 మందిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ.. ఆరు రోజులుగా 5,300 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. వీరిలో 170 మందిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేసి, అందులో ఇప్పటికే 79 మందికి శస్త్రచికిత్స చేయించామని పేర్కొన్నారు. సభ్యులు రచ్చ శ్రీరాములు, గణేశ్, రఘు, యాదయ్య, శ్రీపతి, శేఖర్, శ్రీను, శివ, కల్యాణ్ పాల్గొన్నారు.


ఆమనగల్లు: సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ఇబ్రహీంపట్నం: ఖానాపూర్ ఏకశిలా ఆలయంలో..

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- మహిళల సామూహిక వ్రతాలు


కడ్తాల్: పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, కడ్తాల్ తదితర ప్రాంతాల్లోని సాయిబాబా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే బాబాదర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్నారు. ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకాలు చేశారు. కార్యక్రమాల అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

కడ్తాల్: గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని షిరిడీ సాయి ఆలయంలో వేడుకలను ప్రముఖ ఉపాసకులు జ్ఞానప్రసూనాంబ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు, షిరిడీ సాయి వ్రతాలు జరిపారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, నాయకులు భిక్షపతి, మల్లేశ్, శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: పట్టణంలోని షిరిడీ సాయిబాబా దేవాలయంలో గురువారం గురుపౌర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పచ్చని తోరణాలు, పూలతో శోభాయమానంగా అలంకరించారు. మధుసూదన్‌శర్మ ఆధ్వర్యంలో బాబా మూలవిరాట్‌కు అభిషేకం, ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపించారు. అనంతరం సాయికి సామూహిక వ్రతాలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. వేడుకల్లో ఆలయ ఇన్‌చార్జి పాలాది ఆంజనేయులు, పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, సీఐ జానకిరాంరెడ్డి, పాపిశెట్టి రాము, నయనాచారి, మండ్లి రాములు, కృష్ణనాయక్, శివాజీ, పూసల సత్యం, సైదులుగౌడ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఏకశిలా మందిరంలో..

ఇబ్రహీంపట్నం: భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఖానాపూర్ సమీపంలోని ఏకశిలా సాయిబాబా మందిరంలో పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. గురువారం 108 కలశాలతో బాబాకు అభిషేకం, సత్యనారాయణ స్వామివ్రతం, పుష్పాభిషేకం, దత్తాత్రేయ హోమం తదితర కార్యక్రమాలు జరిపించారు. అనంతరం అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సాయిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీరమ్యవేణుగోపాల్‌రావు పలువురిని శాలువా కప్పి సన్మానించారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, లియోక్లబ్ ఆఫ్ కడ్తాల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సూచించారు. రక్తదానంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ యాటగీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, ఎస్సీసెల్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు జగన్, సింగిల్ విండో డైరెక్టర్లు వెంకటేశ్, శ్రీనివాస్, కడ్తాల్, ఆమనగల్లు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు బీచ్యానాయక్, జగన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.


రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

క్లబ్ సేవలు అభినందనీయం

మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని, ఆ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీల్స్ ఆన్ మీల్స్ అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్లబ్ ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలు విస్తృతం కావాలని, వాటితోనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వామ్యులు కావాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌గుప్తా, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, రాములుగౌడ్, క్లబ్ సభ్యులు జహంగీర్‌అలీ, రాజేందర్‌యాదవ్, వెంకటేశ్, మహేందర్‌గౌడ్, సత్యం, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.


వీల్స్ ఆన్ మీల్స్ ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

గురువే ప్రత్యక్ష దైవం

- విద్యార్థుల జీవితాల్లో వెలుగును నింపే మహానుభావులు
- మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్
- అధ్యాపకులకు సన్మానం


ఇబ్రహీంపట్నం: కళాశాలలో మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

ఇబ్రహీంపట్నం: గురువే ప్రత్యక్ష దైవం. విద్యార్థుల జీవితాల్లో వెలుగును ప్రసాదించే మహానుబావులు వారేనని మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు బూర నర్సయ్యగౌడ్ అన్నారు. గురుపౌర్ణమిని పురస్కరించుకొని బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముత్యాల మహేందర్ ఆధ్వర్యంలో గురువారం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల అధ్యాపకులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థికి జ్ఞానాన్ని ప్రసాదించే శక్తి ఉపాధ్యాయుల్లోనే ఉందని పేర్కొన్నారు. వ్యక్తి ఎదుగుదలలో గురువు పాత్ర ఎనలేనిదని చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు జీవిత విలువలు, సమాజ సేవ, నిర్ణీత లక్ష్యాన్ని సాధించాలంటే సత్ ప్రవర్తన, కృషి, పట్టుదల ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ముత్యాల భాస్కర్, టి.రాంరెడ్డి, రాఘవేందర్, జె శ్రీను, దాసు, సురేష్, రాజు, సంతోష్, రూపక్, శశిధర్‌రెడ్డి, గోవర్ధన్‌లు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ

మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు సతీమణి ముత్యాలమ్మ ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో మాజీ ఎంపీ బూర.. రాములు నివాసానికి వెళ్లి, ముత్యాలమ్మ చిత్రపటానికి పూలమాలులు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యేను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దైవ సమానులు

ఆమనగల్లు: గురువులు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి అన్నారు. గురపౌర్ణమి సందర్భంగా గురువారం ఆమనగల్లు పట్టణంలోని బీజేపీ కార్యాయలంలో వివిధ కులవృత్తుల వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ.. భారతీయ సనాతన ధర్మంలో గురువుకు, గురుపరంపరకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. అనేక విషయాలపై అవగాహన కల్పిస్తూ, జీవితంలోని ప్రతిదశను ఎలా తీర్చిదిద్దుకోవాలో బోధిస్తూ మార్గదర్శనం చేసే వారిని దైవ సమానులుగా భావించే సంస్కృతి మనదని గుర్తుచేశారు. మార్గదర్శనము చేసే గురువులను గౌరవించాలని సూచించారు. బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి, జెడ్పీటీసీస మాజీ సభ్యుడు కండె హరిప్రసాద్, నాయకులు లక్ష్మణ్, చెన్నకేశవులు, శ్రీకాంత్‌సింగ్, నర్సింహ, రవిరాథోడ్, ప్రశాంత్ ఉన్నారు.


ఆమనగల్లు: కులవృత్తిదారులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: సబ్‌స్టేషన్ పరిధి 11 కేవీ శోభానగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రవీందర్ రెడ్డి తెలిపారు. శోభానగర్, సినర్జీ హోమ్స్, ద్వారకానగర్, సిలికాన్ నగర్, ఆపిల్ సిటీ, తుర్కయంజాల్ గ్రామం, ఏవీనగర్, వింటేజ్ హోమ్స్, యాదాద్రి హోమ్స్. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు తుర్కయంజాల్ ఏరియాలోని లక్ష్మీ మెగా టౌన్ షిప్, పాటిగూడ, సూరజ్ నగర్, లక్ష్మీ గార్డెన్, కుర్మగూడ, వైఎస్ఆర్ కాలనీలో సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ తెలిపారు.

కానిస్టేబుల్‌కు రివార్డు అందజేత


కానిస్టేబుల్ సురేశ్‌కు రివార్డు అందజేస్తున్న సీఐ గంగాధర్

కడ్తాల్: లోక్ అదాలత్‌లో.. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో అత్యధికంగా 61 కేసుల్లో ఇరువర్గాలకు రాజీ కుదిర్చిన కడ్తాల్ కోర్టు కానిస్టేబుల్ సురేశ్‌ను రివార్డు వరించింది. గురువారం పోలీస్‌స్టేషన్‌లో.. రూ.3 వేల నగదు రివార్డును కానిస్టేబుల్‌కు అందజేసి సన్మానించారు. సీఐ గంగాధర్, ఎస్ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, హెడ్ కానిస్టేబుల్ తిరుపతి ఉన్నారు.

మాల్ బస్టాండ్‌ను వినియోగంలోకి తెస్తాం


బస్సును ప్రారంభిస్తున్న సంస్థ సిబ్బంది, నాయకులు

యాచారం: నిరుపయోగంగా ఉన్న మాల్ ఆర్టీసీ బస్టాండ్‌ను వినియోగంలోకి తెస్తామని ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటనర్సప్ప అన్నారు. మాల్ గ్రామం నుంచి గురువారం ఆయన ఎంజీబీఎస్ డిపో వరకు బస్సును ప్రారంభించి మాట్లాడారు. ఈ గ్రామం నుంచి ఉదయం ఎంతో మంది ప్రయాణికులు నగరానికి రాకపోకలు సాగిస్తుంటారని, అందుకే రాత్రి 10 గంటలకు మాల్‌కు వెళ్లి, రాత్రి అక్కడే ఉండి తెల్లవారుజామున 5 గంటలకు నగరానికి వెళ్లే విధంగా ట్రిప్పు వేశామని పేర్కొన్నారు. త్వరలో స్థానిక ప్రయాణ ప్రాంగణాన్ని ప్రయాణికులకు సేవలు అందించేలా చర్యలు తీసుకోనున్నామని వెల్లడించారు. ఇందుకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కావాల్సిన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనువాస్ గుప్తా, మాల్ మాజీ సర్పంచ్ పద్మజ, ఆర్టీసీ సిబ్బంది కనక యాదయ్య, ప్రవీణ్‌కుమార్, బాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రుల పర్యటన

రూ.87.70 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మాడ్గుల: మండల పరిధిలో శుక్రవారం ఆర్అండ్ బీ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్, టూరిజం మంత్రి జూపల్లి కృష్ణారావ్‌లు పర్యటించనున్నారు. రూ.87.77 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మండల కేంద్రంలో 221 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నారు. వారితో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు పాల్గొననున్నారు. మాడ్గుల మండల కేంద్రంలోని ఆస్పత్రి నూతన భవనం నిర్మాణానికి రూ.12.70 కోట్లు, మాడ్గుల నుంచి ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామానికి డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.45 కోట్లు, మండల కేంద్రం నుంచి దేవరకొండరోడ్డు ఆధునీకరణకు రూ.30 కోట్లు మంజూరు అయ్యాయి. మంత్రుల పర్యటన ఏర్పాట్లను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బట్టు కిషన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కొండల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పరిశీలించారు.


మండల కేంద్రంలో శిలాఫలకం పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాలనీ సమస్యలు పరిష్కరించండి

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని లక్ష్మారెడ్డిపాలెం కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాజీ కౌన్సిలర్ కృష్ణారెడ్డి, కాలనీ అధ్యక్షుడు గోవింద్ రెడ్డిల ఆధ్వర్యంలో స్థానికులు గురువారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలనీలో నిత్యం డ్రైనేజీ పైపు రోడ్లపైనే పారుతుండటంతో దుర్వాసన వస్తుందని పేర్కొన్నారు. ఇళ్ల మధ్యలో స్రింకా ఫార్మా కంపెనీతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, నివాసాల పక్కనే లారీల పార్కింగ్‌తో దొంగల బెడద ఎక్కువ అయిందని తెలిపారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డితో పాటు ఇతర అధికారులకు సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. కాలనీ గౌరవ అధ్యక్షుడు బాబురావు, జనరల్ సెక్రటరీ మజీద్ బాబా, ఉపాధ్యక్షులు శివనాగరాజు, రాజు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

ఆమనగల్లు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా బూత్ కమిటీ అధ్యక్షులు, శక్తికేంద్రం ఇన్‌చార్జీలు పనిచేయాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి సూచించారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం పార్టీ మండల బూత్ కమిటీ అధ్యక్షులు, శక్తికేంద్రం ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. దీంతో ఆ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తుందని చెప్పారు. ప్రస్తుత సమయంలో ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రజల మధ్యే ఉంటూ.. సమస్యల పరిష్కారం కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కండె హరిప్రసాద్, ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు లక్ష్మణ్, నాయకులు నర్సింహ, చెన్నకేశవులు, శ్రీకాంత్‌సింగ్, కృష్ణనాయక్, రవిరాథోడ్, ప్రశాంత్, అశోక్, శ్రీను, జగన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామ స్వరాజ్యం

ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

మంచాల: కాంగ్రెస్ పార్టీతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం మంచాల మండలం లింగంపల్లి, తాళ్లపల్లిగూడ, తిప్పాయిగూడ, చిత్తాపూర్, రంగాపూర్, చీదేడు గ్రామాల్లో ఆయన పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో మండలం అభివృద్ధికి నోచుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనతికాలంలోనే అత్యధిక నిధులు తెచ్చి, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. గ్రామ స్వరాజ్యం స్థాపించడమే లక్ష్యంగా ముందుకెళ్తామన్నారు. అర్హులకు సంక్షేమ ఫలాలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, మహిపాల్ పాండురంగారెడ్డి, సహకార సంఘం చైర్మన్ వెదిరే హనుమంత్ రెడ్డి, ఎంపీడీఓ బాలశంకర్, తహసీల్దార్ ప్రసాదరావు, పంచాయతీ రాజ్ డీఈ ఇంద్రసేనారెడ్డి, ఏఈ మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితర పాల్గొన్నారు.

పింఛన్లు పెంచాలి

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వికలాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేల చేయూత పింఛన్లు పెంచాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వీహెచ్‌పీఎస్, ఎమార్పీఎస్, ఎంఎస్‌పీ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య మాట్లాడుతూ.. వికలాంగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు నర్సింహగౌడ్, ముత్యాలు, సతీష్, మహేశ్, సుధాకర్, రాములు, పాండవు ఈశ్వర్, సంజీవ, కొండల్‌లు ఉన్నారు.


మంచాల: లింగంపల్లిలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఎరువుల గోదాం ప్రారంభం

ఇబ్రహీంపట్నం: దండుమైలారం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో రాయపోల్ గ్రామంలో నిర్మించిన ఎరువుల గోదామును గురువారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ మంఖాల కరుణాకర్, దండుమైలారం పీఏసీఎస్ చైర్మన్ బిట్ల వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు దాసు పాల్గొన్నారు.

ఆక్టోపస్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధి 3వ బెటాలియన్ ఆక్టోపస్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆక్టోపస్‌కు సరైన రోడ్డు వసతిని ఏర్పాటు చేయించాలని బెటాలియన్ ఆఫీసర్ జమీల్ బాషా ఎమ్మెల్యేకు విన్నవించారు. సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.


ఆక్టోపస్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి